నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 9 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులను అభినందిస్తున్న తాతా మధు, సండ్ర

కేసులు, జైళ్లకు భయపడేది లేదు..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

కందాల జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

ఖమ్మం రూరల్, జనవరి 8 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసు కేసులు, లాఠీ దెబ్బలు, జైళ్లకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన నిలిచి పోరాడటమే తమ లక్ష్యమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ఈ నెల 9న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఒక రోజు ముందుగా బుధవారం సాయిగణేశ్ నగర్ లోని కందాల క్యాంపు కార్యాలయం వద్ద కందాల యువసేన అధ్వర్యంలో తలసేమియా పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మాయ్య, వేముల వీరయ్య, బాషబోయిన వీరన్నలు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రక్తదానం చేశారు. తొలుత రూరల్ మాజీ జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్లు ఇంటూరి శేఖర్, నాగుబండి శ్రీనివాసరావు, కందాల యువసేన బాధ్యుడు మేకల ఉదయ్, సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్‌లు రక్తదానం చేశారు. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన 125 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రూరల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తాతా మధు, సండ్ర మాట్లాడారు. ఐదేళ్లపాటు పాలేరు ప్రజలను తన కుటుంబ సభ్యులుగా కందాల భావించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కందాల గెలవడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన నాయకులు, కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేరం వెంకటేశ్వర్లు, గూడ సంజీవరెడ్డి, ముత్యం కృష్ణారావు, ఆసిఫ్, మల్లీడు వెంకన్న, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కందాల యువసేన బాధ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ అభివృద్ధి ప్రజల హృదయాల్లో పదిలం

స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలి

బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

టేకులపల్లి, జనవరి 8 : కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో పదిలంగా ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ గ్రామస్థాయి సమన్వయ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో రోళ్లపాడు, తొమ్మిదోమైలుతండా, బేతంపూడి, గోలియాతండా గ్రామ పంచాయతీలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియానాయక్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావులు పాల్గొని మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం రైతుల అభివృద్ధి గురించి ఆలోచించి వారి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇప్పటి నుంచే సమన్వయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. ఎన్నికలను దృష్టి ఉంచుకుని మండలంలోని 36 గ్రామ పంచాయతీలలో సభలు, సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోడ బాలునాయక్, శివకృష్ణ, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ముక్కోటి' ఏర్పాట్లు పూర్తి

- అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి
- రివర్ ఫెస్టివల్‌తో గిరిజన సంస్కృతికి పెద్దపీట
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, జనవరి 8 : ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సంబంధించి భద్రాచలం పట్టణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి ఆయా సెక్టార్ల అధికారులకు అప్పగించిన బాధ్యతలన్నీ పూర్తి చేశారన్నారు. వేలాదిగా తరలిరానుండటంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులతో సర్వం సిద్ధం చేశామని, ఏ సెక్టార్ ఉద్యోగులు అక్కడే విధులు నిర్వర్తించేలా బాధ్యతలు అప్పగించామన్నారు. వీఐపీ, వీవీఐపీలతోపాటు సామాన్య భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కలిగేలా పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ముక్కోటి సందర్భంగా ఈ ఏడాది ప్రత్యేకంగా గోదావరి తీరాన రివర్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని, ఇది గిరిజన సంస్కృతికి అద్దం పట్టేలా ఉంటుందన్నారు. రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులు, పర్యాటకులు రివర్ ఫెస్టివల్‌లో పాల్గొని గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. అనంతరం మిథిలా స్టేడియం వద్ద వైకుంఠ ద్వార దర్శనం పనులను పరిశీలించిన కలెక్టర్.. అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

డీసీసీబీ బ్రాంచ్ ఎదుట ధర్నా

రైతు కుటుంబాలకు ఇన్సూరెన్స్ ఇవ్వాలని సీపీఎం డిమాండ్

ఎర్రుపాలెం, జనవరి 8 : సొసైటీ ద్వారా అందిస్తున్న బీమా నగదు మృతి చెందిన రైతు కుటుంబాలకు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఎర్రుపాలెం డీసీసీబీ బ్రాంచ్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అయ్యవారిగూడెం పీఏసీఎస్‌లో సభ్యులుగా కొనసాగుతూ మృతిచెందిన రైతులు గామాసు నారాయణమ్మ, మందడపు వీరబాబు కుటుంబాలకు సొసైటీ అందిస్తున్న బీమా నగదు రూ.50 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మహిళా నాయకురాలు బండి పద్మ, పెదకోటేశ్వరరావు, హనుమంతరావు, జోగయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం కొత్త బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

పండుగ పూట ప్రయాణమెట్లా?

- ఉమ్మడి జిల్లాలో అరకొరగా ఆర్టీసీ బస్సులు
- ఖమ్మం, భద్రాద్రిలో ఆదాయం ఫుల్.. సర్వీసులు నిల్
- మహాలక్ష్మి పథకంతో పెరిగిన మహిళా ప్రయాణికుల సంఖ్య
- అందుకు అనుగుణంగా లేని బస్సులు.. పైగా డ్రైవర్ల కొరత
- రోజుకు రూ.కోటిన్నర ఆదాయమొస్తున్నా కొత్త బస్సులు సున్నా..
- ఇప్పటికీ అనేక గ్రామాలకు నడవని ఆర్టీసీ సర్వీసులు
- కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపినా ఫలితం శూన్యం

ఖమ్మం, జనవరి 8 : తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పర్వదినమైన సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణం కష్టమనే విషయం స్పష్టంగా కన్పిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదాయం గణనీయంగా ఉన్నప్పటికీ అందుకు తగిన విధంగా సర్వీసులు ఉండడం లేదు. అన్ని ప్రాంతాలకూ అరకొర బస్సులే. పైగా ఇప్పటికే ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు ఇంకా అనేకం ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీలోనే మొదటగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసింది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది. దీని వల్ల మహిళలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ.. అందుకు అనుగుణంగా బస్సులను పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఫలితంగా పండుగ సీజన్లలో నడిపే ప్రత్యేక బస్సులకు మంగళం పాడినట్లయింది. మరో నాలుగు రోజుల్లో జరుపుకునే అతి పెద్ద పండుగ అయిన సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపడం కష్టంగానే కన్పిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలంటూ అనేక గ్రామాల ప్రజలు ఏడాది కాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకుంటూనే ఉన్నారు. అయినా ఫలితం ఉండడం లేదు. ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టు బస్సుల సంఖ్యను పెంచాలని జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా వాటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ స్థితిలో పండుగలకు నడపాల్సిన స్పెషల్ బస్సులపై ఉచిత ప్రయాణం ప్రభావం స్పష్టంగా కన్పిస్తోంది.

ఆదాయం ఫుల్.. సర్వీసులు నిల్..

ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఏడు డిపోలు ఉన్నాయి. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోల్లో 519 బస్సు సర్వీసులను నడుపుతున్నారు. వీటిలో ఆర్టీసీవి 289 బస్సులు కాగా.. 230 అద్దె బస్సులు. వీటిలో పల్లె వెలుగు 177, లహరి 10, రాజధాని 32, సూపర్‌లగ్జరీ 82, డీలక్స్ 36, ఎక్స్‌ప్రెస్ 178, మినీ బస్సులు 4 ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేశాక మహిళా ప్రయాణికుల సంఖ్య అమాంతం పెరిగింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రతి రోజూ 2.25 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. పండుగల సీజన్లలో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీకి ప్రతి రోజూ రూ.1.40 కోట్ల ఆదాయం వస్తోంది. అయినా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడపడంలో సంస్థ వైఫల్యం చెందుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ నెల 9 నుంచి 14 వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు స్పెషల్ సర్వీసులు కేటాయించింది. ఇందులో రిజర్వేషన్ సౌకర్యం కలిగినవి 195, రిజర్వేషన్ సౌకర్యం లేనివి 230, ఇతర బస్సులు 160 కలిపి మొత్తం 585 బస్సులు ఉన్నాయి. అదేవిధంగా ఈ నెల 15 నుంచి 19 వరకు ఖమ్మం రీజియన్ నుంచి హైదరాబాద్‌కు 445 బస్సులు నడుపుతున్నట్లు ఖమ్మం ఆర్టీసీ రీజియన్ ఆర్ఎం తెలిపారు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా అందుకు తగిన సంఖ్యలో బస్సులను మాత్రం పెంచడంలేదు. దీని ద్వారా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. అయినా వారి బాగోగుల గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం రీజియన్‌లో 132 బస్సులు అదనంగా కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రూట్లకూ బస్సులు నడుపుతామని హామీ ఇచ్చారు. కానీ.. అవి ప్రగల్భాలుగానే మిగిలిపోయాయి. కనీసం కొత్త బస్సులూ ఇవ్వడం లేదు. అదేవిధంగా డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉంది. గత 12 ఏళ్ల నుంచి కొత్త డ్రైవర్లను ఆర్టీసీ నియమించలేదు. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, జనవరి 8 : జిల్లాలో రైతుల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్‌పామ్ సాగు, రైతుబీమా, ఎరువుల లభ్యత, క్రాప్‌బుకింగ్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో రైతుబీమా కింద వచ్చిన క్లెయిమ్, ఎల్ఐసీకి సమర్పించిన క్లెయిమ్ చెల్లింపులు ఆలస్యానికి కారణాలు, వాటిని ఎలా సరిచేస్తారు వంటి అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రైతుబీమాలో 420 దరఖాస్తులు వస్తే వ్యవసాయశాఖ నుంచి 347 క్లెయిమ్ ఎల్ఐసీకి సమర్పించారని, మిగిలిన 36 పురోగతిలో ఉన్నాయన్నారు. మరో 73 రైతుబీమా దరఖాస్తులు ఎల్ఐసీకి సమర్పించకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సకాలంలో క్లెయిమ్‌లు చేయాలన్నారు. జిల్లాలో రైతుబీమా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు పెంచాలని ప్రతి క్లస్టర్ పరిధిలో కనీసం 25ఎకరాల ఆయిల్‌పామ్ సాగు అయ్యే విధంగా రైతులను ఒప్పించాలని తెలిపారు. జిల్లాలో క్రాప్ బుకింగ్, రైతుబీమా, అయిల్‌పామ్ సాగు పక్కాగా జరగాలన్నారు. ఈ సీజన్‌లో సన్నరకం వడ్లకు బోనస్ విజయవంతంగా అందించామన్నారు. పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, హర్టికల్చర్ అధికారి మధుసూదన్, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

బాధ్యతగా 'ముక్కోటి' విధులు నిర్వర్తించాలి : భద్రాద్రి ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, జనవరి 8 : ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు రోజులపాటు జరిగే తెప్పోత్సవం, వైకుంఠ ద్వారదర్శనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని భద్రాద్రి ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. భద్రాచలం పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సెక్టార్ల వారీగా అధికారులు తెప్పోత్సవం, ఉత్తర ద్వారదర్శనం ప్రదేశాల్లో విధులు నిర్వర్తించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ముక్కోటి కోసం 1,300 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేయడంతోపాటు రెండు రోజులు భద్రాచలంలో జరిగే వేడుకలకు పోలీసులు విధించే ఆంక్షలకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, మణుగూరు డీఎస్పీ రవీంద్రారెడ్డి, సీఐ సంజీవరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాల్వ పొంగింది.. పంట మునిగింది..

- రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో పంట చేలను ముంచిన 'భక్తరామదాసు' నీరు
- మెయింటెనెన్స్ లేకపోవడమా? ఓవర్ ఫ్లో అయ్యిందా?
- అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు రైతుల ఆరోపణ

చింతపల్లి శివారులో కూరగాయల తోటలోకి వచ్చిన వరద నీరు

ఖమ్మం రూరల్, జనవరి 8 : కాల్వల్లో ప్రవహించాల్సిన భక్తరామదాసు ప్రాజెక్టు వరద నీరు పంట పొలాలపైకి చేరడంతో సాగు రైతులు ఇబ్బందిపడ్డారు. ఈ ఘటన రూరల్ మండలం చింతపల్లి గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు తిరుమలాయపాలెం వద్ద భక్తరామదాసు ప్రాజెక్టుకు సంబంధించిన నీటిని మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. అయితే బుధవారం రూరల్ మండలం చింతపల్లి గ్రామ శివారులో యాసంగి పంట పొలాల పైనుంచి భారీగా వరద నీరు ప్రవహించింది. తిరుమలాయపాలెం మండలం నుంచి రూరల్ మండలానికి వచ్చే శ్రీరాంసాగర్ పాత కాల్వ(20ఎల్ఎల్) ద్వారా నీటిని వదిలారు. కాల్వ మెయింటెనెన్స్ లేకపోవడమా? లేదా ఓవర్ ఫ్లో జరిగిందా? తెలియదు కానీ కాల్వ గట్టుపై నుంచి వరద పంట పొలాల్లోకి చేరింది. అప్రమత్తమైన రైతులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. అప్పటికే చింతపల్లి గ్రామానికి చెందిన వేల్పుల కృష్ణమూర్తి, గొంగటి కృష్ణ తదితర రైతులకు చెందిన యాసంగి వరి నారుమడులు, కూరగాయల తోటలు, వేసిన వరి నాట్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు. కనీసం కాల్వ పరిస్థితి చూడకుండా, అంచనాలకు మించి నీటిని ఎలా వదులుతారని రైతులు మండిపడ్డారు.

పిండిప్రోలు వద్ద పొంగిన ఎస్సారెస్పీ కాల్వ

తిరుమలాయపాలెం, జనవరి 8 : పిండిప్రోలు వద్ద వరద ఉధృతికి ఎస్సారెస్పీ డీబీఎం-60 కెనాల్ ఉప్పొంగి పంట పొలాల్లోకి నీరు చేరింది. అధికారులు పాలేరు రిజర్వాయర్ నుంచి భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా శ్రీరాంసాగర్ కాల్వల్లోకి నీటిని విడుదల చేశారు. కాల్వల ద్వారా తిరుమలాయపాలెం మండలంలోని చెరువుల్లోకి నీటిని పంపిస్తున్నారు. ఈ క్రమంలో డీబీఎం-60 మెయిన్ కెనాల్, మైనర్ కాల్వల్లో చెట్లను తొలగించి మరమ్మతు చేయకుండానే నీటిని విడుదల చేశారు. దీంతో ఆ నీరంతా పొంగి పత్తి, మిర్చి తోటల్లోకి చేరినట్లు పిండిప్రోలుకు చెందిన రైతు చామకూరి వెంకన్న తెలిపారు. వెంటనే కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమలాయపాలెం : పిండిప్రోలు ప్రాంతంలో మరమ్మతులకు నోచుకోక పొర్లిన శ్రీరాంసాగర్ కాల్వ

వలసలను నివారించాలి..

తహసీల్ ఎదుట ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ఇల్లెందు తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

ఇల్లెందు రూరల్, జనవరి 8 : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న మాట్లాడుతూ పల్లెల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడం, వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం వల్ల యువత పట్టణాలకు వలసబాట పడుతున్నదన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయన్నారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల కిరణ్, బుర్ర రాఘవులు, వాంకుడోత్ శంకర్, దరావత్ దేవ, కోరం ముత్తక్క, బానోతు లష్కర్, బండారి సత్యం పాల్గొన్నారు.

విద్యార్థి వివరాలు అపార్ కార్డులో నిక్షిప్తం

భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

ఇల్లెందు రూరల్, జనవరి 8 : ప్రతి విద్యార్థి వివరాలు అపార్ కార్డులో నిక్షిప్తమై ఉంటాయని భద్రాద్రి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. బుధవారం ఇల్లెందు మండల పరిధిలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అపార్‌కార్డు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరికీ అపార్‌కార్డు జనరేట్ చేసే దిశగా టీచర్లను ఆదేశించామని, విద్యార్థి పుట్టిన తేదీ, ఆధార్‌కార్డు నెంబర్, తల్లిదండ్రుల వివరాలు, చిరునామా తదితర వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అపార్ కార్డు జనరేట్ చేయడంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులందరూ అపార్ నమోదు వివరాలను మొదలుపెట్టాలన్నారు. రాబోయే 3రోజుల్లో లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. టెక్నికల్ సమస్యలు ఏమైనా ఉంటే మండలంలో ఉన్న స్ట్రాంగ్‌టీచర్ లేదా ఎంఐఎస్‌లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి స్వామి, ప్రధానోపాధ్యాయులు, స్ట్రాంగ్ టీచర్లు, ఎంఐఎస్, సీసీవో, సీఆర్‌పీ, మేనేజ్‌మెంట్ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.